నిర్యాణము



జననం
15-06-1948

మరణం
13-03-2025

కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజి) గారు

ప్రముఖ పారిశ్రామికవేత్త

మా తండ్రిగారైన **కీ॥శే॥ డా॥ అరుణాచలం మాణిక్యవేల్ (అన్నాజీ)** గారు
ఛైర్మన్ కమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్,
భారతి కన్స్యూమర్ కేర్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్

ది. 13-03-2025 గురువారం నాడు "స్వర్గస్థులైనారు" కావున

ది. 28-03-2025 శుక్రవారం, గుంటూరు, గోరంట్ల,
మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు, 2వ ఫేస్ లోని
'శ్రీ కన్వెన్షన్' నందు "పెద్దకర్మ" కార్యక్రమం జరుగును. కావున తెలియపరచడమైనది.

విందు : మధ్యాహ్నం గం. 12-00 లకు

ఇట్లు, కుమారుడు
పర్విన్‌రాజ్ మాణిక్యవేల్ మరియు **కుటుంబ సభ్యులు.**

న్యూస్‌రీల్

ఒక్కరోజే రూ.2.12 కోట్లు పన్ను వసూలు



నెహ్రూనగర్ : గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం ఒక్కరోజు రూ. 2.12 కోట్లు వసూలు అయ్యాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ బాడీబిల్డింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పెనమలూరు: జాతీయ బాడీబిల్డింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్ర జట్టుకు ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపి కయ్యారని జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ తెలిపారు. పెనమలూరు మండలం కానూరులోని అశోక్‌జిమ్‌లో బుధవారం జరిగిన క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 29, 30 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో జాతీయ బాడీబిల్డింగ్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర జట్టుకు ఉమ్మడి జిల్లా నుంచి 55 కిలోల విభాగంలో సీహెచ్.దినేష్‌రెడ్డి, 60 కిలోల విభాగంలో ఎం.దినేష్, 66 కిలోల విభాగంలో కె.హరి, 75 కిలోల విభాగంలో సీహెచ్. గోపీచంద్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి జిల్లాల బాడీబిల్డింగ్ అసోసియేషన్ చైర్మన్ గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు బి. మనోహర్, వైఎస్సార్ సీపీ తాడిగడప మునిసిపల్ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ తదితరులు అభినందించారు. క్రీడాకారులకు అశోక్ జిమ్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తామని అశోక్ తెలిపారు.

ఎన్టీఆర్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: జాతీయ అంతర విశ్వ విద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మహిళల జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన స్వపంతి, గ్రీష్మ, రక్షిత, చరితా రెడ్డి, ఉదయలక్ష్మి, అన్నపూర్ణాదేవి, ఉదయలక్ష్మి, సిరి, శిరీష, కీర్తిగాయత్రి జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. చెన్నైలోని అలగప్ప యూనివర్సిటీలో ఈ నెల 29 నుంచి జరిగే జాతీయ పోటీలకు ఈ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. జట్టును వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నరసింహం, రిజిస్ట్రార్ రాధిక రెడ్డి వర్సిటీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు. జట్టుకు మేనేజర్‌గా రాము, కోచ్‌గా పవన్ కుమార్ వ్యవహరిస్తారు.

ఘంటసాల బౌద్ధ స్థూపాన్ని సందర్శించిన జపాన్ దేశస్తులు

ఘంటసాల: ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాల బౌద్ధ స్థూపాన్ని, మ్యూజియాన్ని సందర్శించడం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని జపాన్ దేశస్తులు అన్నారు. కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామంలోని బౌద్ధ స్థూపం, బౌద్ధ మ్యూజియాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా బౌద్ధ స్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థూపం ఎదురుగా ఉన్న బౌద్ధ శిల్ప సంపద ఉన్న మ్యూజియాన్ని సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఘంటసాల గ్రామ చరిత్ర, బౌద్ధ స్థూపం, మ్యూజియం వివరాలను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ జపాన్ దేశస్తులకు వివరించారు. తెలుగు రాష్ట్రాల్లోని బౌద్ధ క్షేత్రాల సందర్శనలో భాగంగా ఘంటసాల బౌద్ధ స్థూపం, మ్యూజియాన్ని సందర్శించినట్లు హైదరాబాద్‌కు చెందిన గైడ్ కరుణానిధి తెలిపారు. అమరావతి, నాగార్జున సాగర్, గుంటుపల్లి గుహలు, శ్రీకాకుళం జిల్లాలోని బౌద్ధ ప్రదేశాల్లో పర్యటించి ఘంటసాలకు వచ్చినట్లు చెప్పారు. జపాన్ దేశస్తులు నాకజిమ యుకి హిసా, కటయమా తత్తసు, ఊరగామి నోరికో, సానో కాజుహరు, కనికో తకాకాజు, మంచిదా షొంచి, యామజకి తదశి, వాకుయ్ తోషిమి తసు, టోనే మోటాకో పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోండి

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్‌బాబు బుధవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితాను వెబ్‌పోర్టల్‌లో ప్రదర్శించారని, ఎంపికై న అభ్యర్థులందరూ తమ ఆప్షన్ సర్వీస్ ద్వారా జ్ఞానభూమి పోర్టల్‌లో ఎం.ప్యానల్ కోచింగ్ సంస్థలకు ఈ నెల 28వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు.

పక్కనుందని పాగా వేసేశారు!

రాజధాని ప్రాంతమైన గుంటూరు నగరంలో స్థలాలకు మంచి డిమాండ్ ఉంది. అదే ప్రైమ్ ఏరియాలో అయితే గజం రూ.లక్షలు పలుకుతోంది. అటువంటి గుంటూరు నగరంలోని స్థంభాలగరువు (ఎల్‌ఐసీ) కాలనీలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉంది. దానిని కాపాడుకోవాల్సిన నగరపాలక సంస్థ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. దీంతో ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతోంది.



స్థంభాలగరువులోని స్థలం



ప్రభుత్వ స్థలంలో ఉన్న నిర్మాణం

- సర్కారు భూమిని చెరపట్టిన ప్రైవేటు వ్యక్తులు
- డెవలప్‌మెంట్ పేరుతో ప్లాట్స్ వేసేందుకు పన్నాగం
- మున్సిపల్ ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకున్న వైనం
- ఫిర్యాదులు అందినా స్పందించని నగరపాలక సంస్థ



2023లో ఇచ్చిన సర్వే రిపోర్టు

నెహ్రూనగర్: స్థంభాలగరువు (ఎల్‌ఐసీ కాలనీ 2వ లైను) దగ్గర సుమారు 500 గజాల స్థలం ఉంది. దానిని అనుకునే ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన 1368 (ప్రభుత్వ స్థలం కలుపుకొని మొత్తం 1800 గజాల స్థలం) గజాల భూమి ఉంది. ప్రభుత్వ స్థలానికి నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో సదరు ప్రైవేట్ వ్యక్తులు ఆ ప్రభుత్వ స్థలం చుట్టూ గోడ నిర్మించారు. తరువాత డాక్యుమెంట్ పుట్టించి సదరు స్థలంలో డెవలప్‌మెంట్ కింద అపార్ట్‌మెంట్ నిర్మించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందుకు గాను నగరపాలక సంస్థకు ప్లాన్ కోసం దరఖాస్తు కూడా అందింది. 1368 గజాల స్థలంలో 1,280 గజాలకు ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకుని, మిగిలిన స్థలాన్ని మిగులు భూమిగా ప్లాన్‌లో చూపించారు.

దొంగ సర్వే రిపోర్టు ఇచ్చిన సర్వేయర్లు

2023వ సంవత్సరంలో సదరు స్థలానికి సర్వే రిపోర్టు కోసం ప్రైవేట్ వ్యక్తులు దరఖాస్తు చేసుకున్నారు. సదరు ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న డాక్యుమెంట్స్‌లో రెండు పక్కల ప్రభుత్వ స్థలమని పక్కాగా ఉన్నప్పటికీ సర్వేయర్‌ని మేనేజ్ చేసుకుని ఇది ప్రభుత్వ స్థలం కాదని, పక్కగా ఉందని రాసి మరి ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ఆ సర్వే రిపోర్టును ఆధారం చేసుకుని ప్రభుత్వ స్థలం కాదని, సదరు ప్రైవేట్ వ్యక్తులు దర్జాగా డెవలప్‌మెంట్‌కి ఇచ్చేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ట్యాక్స్ కూడా సక్రమంగా లేని పరిస్థితి

సదరు స్థలంలో 1975 నుంచి 500 గజాలకే మాత్రమే పన్ను ఉంది. మిగిలిన స్థలానికి పన్ను లేదు. పన్ను లేకపోయినప్పటికీ వేయాల్సిన రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సదరు ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడంతో పాటు పక్కనే ఉన్న మరొకరి స్థలాన్ని కూడా ఆక్రమించారని దీనిపై న్యాయం చేయాలని పక్క స్థల యాజమాని గత కొద్ది రోజుల క్రితం నగర కమిషనర్‌ను కలిసి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంతవరకు నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

నా స్థలం నాకు ఇప్పించాలి



మా స్థలం పక్కనే ప్రభుత్వ భూమి ఉంది. దానిని ఆక్రమించుకున్నారు. దాంతోపాటు మా స్థలం 1,170 గజాలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 900 గజాలే ఉంది. దీనిపై నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశా. కానీ ఎటువంటి స్పందన లేదు. అధికారులు స్పందించి నా స్థలం నాకు ఇప్పించాలి. సర్వే రిపోర్టు చేసేటప్పుడు కూడా కనీసం మాకెవరికి తెలియకుండా దొంగ సంతకాలతో సర్వే చేయించారు.

– పంచుమర్తి శ్రీనివాస్, స్థంభాలగరువు

సర్వే రిమార్క్స్ రాగానే చర్యలు

స్థంభాలగరువులో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని ఫిర్యాదు అందింది. దాని ఆధారంగా సర్వే రిమార్క్స్‌కు రాశాం. సర్వే రిమార్క్స్ రాగానే ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్/ రక్షణ గోడ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, టీపీఎస్, నగరపాలక సంస్థ

టెన్త్ మూల్యాంకన పారితోషికం సకాలంలో ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి మూల్యాంకన విధులు ముగిసిన వెంటనే ఉపాధ్యాయులకు పారితోషికం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ అధి కారి యు.వి సుబ్బారావును డీపీఆర్టీయూ ప్రతినిధులు కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను ఆధ్వర్యంలో నాయకులు డీఈఓను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. విజయవాడకు దూరంగా ఉన్న గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల ఉపాధ్యాయులకు వారి ఆసక్తిని బట్టి మూల్యాంకన విధులు కేటాయించాలని, గర్భిణులు, పసి బిడ్డల తల్లులకు మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తమ వినతిపై డీఈఓ సానుకూలంగా స్పందించారని శ్రీను తెలిపారు.

బహిరంగ వేలంలో రూ. 27.48 లక్షల ఆదాయం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మవారి ఆలయం వద్ద ఏడాది కాలంలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.27.48 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. ఆలయంలో ఫొటలు తీసుకునే హక్కును రూ.8.50 లక్షలకు కె.శ్రీనివాసరావు), చాపలు అద్దెకిచ్చే హక్కును రూ.88 వేలకు కె.అజయకుమార్, భక్తుల సామాన్లు, పాదరక్షలు భద్రపరిచే హక్కును రూ.3 లక్షలకు జి.గోపినాథ్, నూతనంగా నిర్మించిన సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ హక్కును రూ.8.12 లక్షలకు ఎన్నురేష్ దక్కించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో 20 దుకాణాల నిర్వహణకు వేలంలో రూ.6,98,000 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జంగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాల్షియం పరీక్ష.. గుండెకు రక్ష

- ఇటీవల గుండెపోటుతో యువ వైద్యుడి మృతి
- అన్ని వయస్సుల వారిలో పెరుగుతున్న బాధితులు
- క్యాల్షియం స్కోర్ పరీక్షతో ముందుగా వ్యాధి నిర్ధారణ
- 40 ఏళ్లు దాటిన, గుండెపోటు లక్షణాలున్న వారికి ఉపయోగం



గుంటూరు మెడికల్ : జిల్లాలోని పెదకాకానికి మండలం వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శివాచారి (33)కి ఈ నెల 9న డాక్టర్ లావణ్యతో వివాహమైంది. ఈ నెల 22న గుండెపోటు వచ్చి విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో సర్జరీ చేయించారు. చికిత్స పొందుతూనే డాక్టర్ శివాచారి మరణించాడు. చిన్న వయస్సులోనే డాక్టర్‌గా ఉన్న వ్యక్తి గుండెపోటుతో మరణించడం అందరిని కలచి వేసింది. గుంటూరు నగరంలోని అరండల్‌పేటకు చెందిన శ్రీనివాస్ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల ఉదయం పాల ప్యాకెట్‌కు వెళ్లి వచ్చి కుర్చీలో కూర్చున్న అతనికి గుండెపోటు వచ్చి వెంటనే మరణించాడు. ఇలా ఆకస్మిక గుండెపోటు మరణాలు ఎక్కువయ్యాయి.

40 ఏళ్లకే గుండెపోటు

ఊరికే కూర్చుని తినే వారికే కాదు.. రెగ్యులర్‌గా వాకింగ్, జిమ్, యోగా, ధ్యానం చేసే వారికీ గుండెపోటు వస్తోంది. ఆహార నియమాలు పాటించే వ్యక్తులతోపాటు వారంలో నాలుగైదు రోజులైనా బిర్యానీ లేనిదే ముద్ద మింగని వారికీ గుండెపోటులు వస్తున్నాయి. ఇలా ప్రతి ఒక్కరినీ ఈ సమస్య వేధిస్తుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు 60 ఏళ్లు పైబడిన వారికి వచ్చే గుండెపోటు ఇప్పుడు 40ఏళ్లలోపు వారికీ వస్తోంది. ఇది రోగులకే వారి కుటుంబసభ్యులకూ మనోవేదన మిగులుస్తోంది. గుండెపోటును ముందే గుర్తించే అవకాశం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. గుండెపోటు లక్షణాలు ఉన్నప్పుడే చేసే పరీక్షల కంటే ముందుగానే హార్ట్ ఎటాక్‌కు కారణమయ్యే రక్తనాళాల్లో ఏర్పడ్డ పూర్తి అడ్డంకులు లేదా నాళాల అంచులకు ఏర్పడ్డ ప్లేక్ (ఫలకం)లను కొత్తగా కరోనరి సీటీ కాల్షియం స్కోరింగ్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. కరోనరి కాల్షియం స్కోర్ ఎక్కువగా ఉంటే ధమని గోడలకు ప్లేక్ ఎక్కువ మొత్తంలో పేరుకున్నట్లు లెక్క. అలాగే వీరికి హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వచ్చే ఐదు నుంచి పదేళ్లలోపు రానున్న హార్ట్ ఎటాక్‌ను కూడా ఈ కాల్షియం స్కోర్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పరీక్షలో మొదటి నుంచి చివరి వరకు చేసే ప్రక్రియకు ఐదు నుంచి పది నిమిషాల వరకు సమయం పడుతుంది. ఈ పరీక్ష ఐదేళ్లకు ఒకసారి చేయించుకోవాలి.

- **ఎవరికి అవసరం అంటే...**

కరోనరి కాల్షియం స్కాన్ అందరికీ అవసరం లేదు. 40 ఏళ్లు పైబడిన వారికి రిస్క్ ఫాక్టర్స్ అధికంగా ఉంటే ఈ పరీక్ష ఉపయోగపడుతుంది. ఈ స్కానింగ్ రిపోర్ట్‌ను బట్టి రోగులకు వైద్యులు సలహాలు, రిస్క్ ఫ్యాక్టర్స్ గురించి స్పష్టంగా చెప్పగలగుతారు.

- **వీరిలో రిస్క్ ఎక్కువ**

గుండెజబ్బుకు సంబంధించిన లక్షణాలు కనిపించే వారి కన్నా ఎలాంటి లక్షణాలు లేని వారిలోనే రిస్క్ ఎక్కువ. ఎందుకంటే లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. కానీ లక్షణాలు లేకపోవడం వల్ల సమస్యను గుర్తించడం ఆలస్యమై భవిష్యత్ పరిణామాలు తీవ్రంగా మారొచ్చు.

- **గుండెపోటుకు కారణాలు**

రక్తంలో అధిక కొవ్వు శాతం, మధుమేహం, అధిక రక్తపోటు, దూమపానం, అధిక బరువు, వంశ పారంపర్యం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి.

- **వ్యాధి నిర్ధారణ**

ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ పరీక్షలు గుండె పరిస్థితిని వివరంగా చెప్పగలవు. అయితే భవిష్యత్తులో వచ్చే ప్రమాదాలను మాత్రం గుర్తించలేవు. యాంజియోగ్రామ్, కంప్యూటెడ్ టోమోగ్రఫీ(సీటీ) యాంజి యోగ్రామ్ పరీక్షల ద్వారా గుండె రక్తనాళాల్లో బ్లాకేజీలు ఉంటే గుర్తించి తొలగించుకోవాలి. అయితే ఇవన్నీ లక్షణాలున్న గుండెజబ్బు గల రోగులకు మాత్రమే.

కార్డియాలజీ ఓపీకి 200కుపైగా

గుంటూరు జీజీహెచ్ కార్డియాలజీ ఓపీకి 200 నుంచి 250 మంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఆసుపత్రిలో రోజూ 200 మందికి ఈసీజీ, 50 మందికిపైగా 2డీ ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో కార్డియాలజిస్టుల వద్దకు రోజూ 20 నుంచి 50 మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజూ 50 మందికి గుండె శస్త్రచికిత్సలు చేస్తున్నారు. పుట్టుకతో కొందరికీ, జన్యుకారణాలతో మరికొందరికి గుండెజబ్బులు వస్తాయి. వీరితోపాటు వయస్సు రీత్యా 60 ఏళ్లు దాటిన వారికి వచ్చే గుండెపోటు వంటి సంఘటనలు మాత్రమే ఉండేవి. ఆధునిక జీవనశైలి వల్ల వయస్సుతో సంబంధం లేకుండా చిన్న వయస్సులోనే గుండెపోటు మరణాలు సంభవించడం అందరిని ఆందోళనకు గురిచేస్తోంది. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిళ్లు చిన్నవయస్సులో గుండెపోటు రావడానికి కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు. కడుపు నిండా తినడం, వ్యాయామాలు చేయకపోవడం, దాన్ని అరిగించేలా పనులూ చేయకపోవడం, కూర్చుని చేసే పనులు అధికంగా ఉండటం, దాంతో పాటు జంక్ ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్స్ అధికంగా తీసుకోవడం, తక్కువ సమయంలో ఎక్కువ పని చేయాల్సి రావడంతో తీవ్ర మానసిక ఒత్తిడి వల్ల రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోతోంది. ఫలితంగా గుండెకు రక్తం సరఫరాలో ఇబ్బందులు ఏర్పడి గుండెపోటు వస్తోంది.

ముందే నివారించుకోవచ్చు



గుండెపోటును ముందస్తుగానే నిర్ధారించేందుకు నేడు ఆధునిక, సాంకేతిక వైద్య పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు, కుటుంబంలో ఎవరికైనా గుండె జబ్బు ఉన్నవారు ముందస్తుగా స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి. వచ్చే ఐదేళ్ల కాలంలో గుండెపోటు వస్తుందా? రాదా? అనే విషయాలను సీటీ కాల్షియం స్కోర్ అనే పరీక్ష చేసి నిర్ధారించవచ్చు. గుండె రక్తనాళాల్లోని బ్లాక్‌లను ఇది పూర్తిగా గుర్తిస్తుంది. గుండెలోని కొలెస్ట్రాల్ లోడ్ ఏ లెవెల్‌లో ఉందో తెలుస్తుంది. కొలెస్ట్రాల్ లోడ్ ఎంత ఎక్కువ ఉంటే హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి.

– డాక్టర్ పోలవరపు అనురాగ్, ఇంట్రావెన్షనల్ కార్డియాలజిస్టు, గుంటూరు

భవిష్యత్తు అవసరాలు తీర్చేలా శంకర్ విలాస్ ఫ్లైఓవర్

ఫ్లయ్ ఓవర్ సాధన ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సమితి ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: రాజధానిలో ముఖ్య నగరంగా ఉన్న గుంటూరు ప్రజల భావి అవసరాలను తీర్చి, బహుళ ప్రయోజనాలను కల్పించేలా ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారని శంకర్‌విలాస్ ఫ్లై ఓవర్ సాధన ఐక్య కార్యాచరణ సమితి నాయకుడు ఎల్.ఎస్ భారవి పేర్కొన్నారు. బుధవారం శంకర్‌విలాస్ సెంటర్‌లో వివిధ పార్టీలు, పౌర, వర్తక, వ్యాపార సంఘాల నాయకులు పౌరసభ నిర్వహించారు. అనంతరం బ్రాడీపేట నుంచి లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రజా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారవి మాట్లాడుతూ గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ ఫ్లైఓవర్ కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రూ.98 కోట్లు విడుదల అయ్యేలా చేశారన్నారు. హిందూ కళాశాల నుంచి లాడ్జి సెంటర్ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం 100 అడుగుల వెడల్పుతో ఐకానిక్ మోడల్లో జరుగుతుందని మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రకటించారన్నారు. అనేక సవరణలతో ఫ్లై ఓవర్ కేవలం ఏసీ కళాశాల నుంచి అరండల్‌పేట 7, 8 లైన్ల వరకే నిర్మిస్తామని కొత్త డీపీఆర్ తయారు చేసి వెబ్‌సైట్‌లో ఉంచి ప్రజలను మోసగించారన్నారు. నూతన డీపీఆర్‌తో ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే అది భవిష్యత్తు అవసరాలు, బహుళ ప్రయోజనాలు తీర్చేలా ఉండదన్నారు. ఉన్న వనరులతోనే ఫ్లైఓవర్ నిర్మాణానికి సంకల్పించడం ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను తప్పుదారి పట్టించడమేనని విమర్శించారు. ఇప్పుడు ప్రకటించిన ప్యాకేజీతోపాటు ప్రాజెక్టులోనూ రోడ్ అండర్ బ్రిడ్జికి ఎటువంటి కేటాయింపులు లేకపోగా ఫ్లై ఓవర్ పూర్తయిన తర్వాతనే ఆర్‌యూబీ కడతామని అధికారులు ప్రకటించటం ప్రజలను ఇక్కట్లు పాలు చేయడం తప్ప మరొకటి కాదన్నారు. ఆర్‌యూబీ నిర్మించిన తరువాతే ఇరువైపులా 30 అడుగుల సర్వీసు రోడ్లతోపాటు సింగిల్ పిల్లర్ మెట్రో హైట్ సిస్టం పై ఓవర్ ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ప్రకటించిన రూ.147 కోట్లతో లాడ్జి సెంటర్ నుంచి హిందూ కళాశాల వరకు ఫ్లైఓవర్ ప్రాజెక్టు నిర్మించాలన్నారు. ర్యాలీలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు, అవగాహన సంస్థ అధ్యక్షుడు కొండా శివరామరెడ్డి, రేట్ అసోసియేషన్ ప్రతినిధులు వల్లూరు సదాశివరావు, రాధాకృష్ణ, హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి పీఎస్ మూర్తి, రాజ్యాంగ చర్చా వేదిక ప్రతినిధి అవధానుల హరి, డెమొక్రటిక్ ఫోరం ప్రతినిధులు మల్లికార్జునరావు, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ మహిళా బ్యారక్ ప్రారంభం



ఆర్‌పీఎఫ్ మహిళా బ్యారక్‌ను ప్రారంభిస్తున్న ఆరోమా సింగ్ ఠాకూర్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడలో ఆర్‌పీఎఫ్ మహిళా బ్యారక్ ప్రారంభమైంది. ఆర్‌పీఎఫ్ మహిళా సిబ్బంది సంక్షేమం, సాధికారత దిశగా విజయవాడ డివిజన్‌లో రూ.1.5 కోట్లుతో 30 పడకల మహిళా బ్యారక్‌ను రైల్వే కోర్టు సమీపంలో నిర్మించారు. దక్షిణ మధ్య రైల్వే ఇన్‌స్పెక్టర్ జనరల్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఆరోమా సింగ్ ఠాకూర్ ఈ బ్యారక్‌ను బుధవారం రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్‌పీఎఫ్ ఎస్కార్ట్, ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్‌పీ), రైల్వే విధులకు హాజరయ్యే మహిళా పోలీసులు విశ్రాంతి తీసుకునేందుకు బ్యారక్‌లో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై వర్కుషాపు

విజయవాడ డివిజన్ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో రైల్వే ఆడిటోరియంలో ఏపీఆర్‌పీఎఫ్, ప్రభుత్వ రైల్వే పోలీసులకు 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్' పై శిక్షణ ఇచ్చారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లకు కీలకమైన జ్ఞానం, నైపుణ్యాలు అందించడమే శిక్షణ తరగతుల లక్ష్యమని ఆరోమా సింగ్ ఠాకూర్ తెలిపారు. అనంతరం విధుల్లో అనుసరించాల్సిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీఎస్సీ వల్లేశ్వర బి.టి, సీనియర్ డీఈఎన్ ఎస్.వరుణ్‌బాబు, సీనియర్ డీఓఎం డి.నరేంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

రాగి తీగలు చోరీ చేసే అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు



స్వాధీనం చేసుకున్న రాగి వైరు, నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కంకిపాడు: సులభ సంపాదన మోజులో రాగితీగల చోరీలకు పాల్పడ్డ అంతర్ రాష్ట్ర ముఠాకు కంకిపాడు పోలీసులు చెక్ పెట్టారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 22 కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.4.50 లక్షల విలువైన 300 కిలోల రాగి తీగ స్వాధీనం చేసుకున్నారు. కంకిపాడు పోలీసుస్టేషన్‌లో బుధవారం గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు విలేకరుల సమావేశం నిర్వహించి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామానికి చెందిన పంబి శ్రీను తాపీ కార్మికుడు. తాపీ పనిపై వచ్చే డబ్బులు సరిపోకపోవటంతో తన విలాసాల కోసం చోరీలను మార్గంగా ఎంచుకున్నాడు. ఇతనిపై గతంలోనే 12 వైరు చోరీ కేసులు, రెండు స్నాచింగ్ కేసులు ఉన్నాయి. జల్సాలను తీర్చుకోవటానికి తనకు పరిచయస్తులైన ఇబ్రహీంపట్నం ఫెర్రీకి చెందిన ముత్యాల గోపాలకృష్ణ, జి.కొండూరు గ్రామానికి చెందిన వెన్నముద్దల దుర్గాప్రసాద్‌రెడ్డిలను కలుపుకొని వ్యవసాయ మోటర్ల దగ్గర ఉండే కరెంటు వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఉండే వైర్లు కత్తిరించి అందులోని రాగివైరు చోరీ చేయటం మొదలుపెట్టారు. నాలుగు నెలలుగా మోటరు సైకిళ్లపై బయలుదేరి పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి వైర్లు కత్తిరించి పంట పొలంలోనే వైర్లు కాల్చి అందులో ఉన్న రాగివైరు చోరీ చేసి అమ్ముకుంటుంటారు. ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి రాగివైర్లు చోరీ చేస్తుంటారు.

రెక్కీలో పట్టుబడ్డ నిందితులు

కంకిపాడు మండలం ప్రొద్దుటూరు పరిధిలోని కొణతనపాడు అడ్డరోడ్డు వద్ద పోలీసులు బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో రెండు మోటర్ బైకులపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ప్రవర్తించటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రధాన నిందితులైన పంబి శ్రీను, ముత్యాల గోపాలకృష్ణ, వెన్నముద్దల దుర్గాప్రసాద్‌రెడ్డిగా గుర్తించారు. వీరిపై ఇప్పటి వరకూ కంకిపాడు–4, ఉంగుటూరు–1, తోట్లవల్లూరు–4, ఆత్కూరు–2, వీరవల్లి–7, హనుమాన్ జంక్షన్–3, ఎ.కొండూరు–1 చొప్పున 22 కేసులు ఉన్నాయి. వీరు 216 వ్యవసాయ మోటర్లు, 7 ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగివైరు చోరీ చేసినట్లు నిర్ధారించారు. నిందితుల నుంచి రూ.4.50 లక్షల విలువైన 300 కిలోల బరువు, 2400 మీటర్ల పొడవు గల రాగివైరు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కేసు విచారణలో ప్రతిభ చూపిన సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్, హెచ్‌సీ కె.చంద్రబాబు, పీసీలు పీఎస్ఎన్ మూర్తి, అశోక్, ఎస్‌డీ బాజీబాబు, హెచ్‌జీలు మురార్జీ, వీఎస్ పిశెలైలకు రివార్డులు అందించారు. సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్, ఉయ్యూరు రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు పాల్గొన్నారు.

భవానీ ద్వీపం పునరుద్ధరణ పనులు ప్రారంభం




భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద వచ్చిన దాదాపు ఏడు నెలలకు పర్యాటక శాఖకు చెందిన భవానీ ద్వీపం పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది ఆగస్ట్ 31న కృష్ణానదికి వరద వచ్చి దాదాపు పది అడుగులకుపైగా నీట మునిగిన భవానీ ద్వీపం తీవ్రంగా దెబ్బతిన్న సంగతి తెలిసిందే. నాటి నుంచి నేటి వరకు ద్వీపానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేక పోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో భవానీ ద్వీపంలో పవర్ రెస్టోరేషన్, వరద ఉధృతికి కూలిపోయిన భారీ వృక్షాలు, మేట వేసిన ఇసుక దిబ్బల తొలగింపు ప్రక్రియ కాంట్రాక్ట్‌ను టెండర్ ద్వారా దక్కించుకున్న బొర్రా క్రాంతి కుమార్ మొదలు పెట్టిన పునరుద్ధరణ పనులకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ బుధవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమామహేశ్వర రావు, విజయవాడ డీవీఎమ్ కృష్ణచైతన్యతో కలిసి ద్వీపంలో పర్యటించారు.

సాక్షి
బాపట్ల
గురువారం । 27 । మార్చి । 2025



కాళీయ మర్దనం అలంకారంలో శ్రీవారు

మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు కాళీయ మర్దనం అలంకారంలో దర్శనమిచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 521.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.



మండప నిర్మాణానికి విరాళం

అద్దంకి రూరల్: శింగరకొండ దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణానికి కనమళ్ల గ్రామానికి చెందిన కాట్రగడ్డ అనిల్‌కుమార్ దంపతులు రూ. 8 లక్షలు విరాళాన్ని అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
బాపట్ల	6.25	4.50
నరసరావుపేట	6.27	4.52
గుంటూరు	6.25	4.50

న్యూస్‌రీల్

నేడు భట్టిప్రోలు కో-ఆప్టెడ్ మెంబర్ ఎంపిక

భట్టిప్రోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కో–ఆప్టెడ్ మెంబర్ స్థానానికి గురువారం పరోక్ష ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎస్. వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రత్యేక అధికారి బి. వేణు గోపాల్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కో–ఆప్టెడ్ మెంబర్ మహ్మద్ ఫిరోజ్ ఎలియాస్ సలీం గత ఏడాది నవంబర్ 13న డిస్ క్వాలిఫై అయినట్లు జెడ్పీ సీఈవో జ్యోతిబసు ఉత్తర్వులు జారీ చేశారు. సలీం వరుసగా మూడు సమావేశాలకు హాజరు కానందున ఖాళీ స్థానం భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఎన్నిక ఉంటుందని తెలిపారు. సమావేశంలో సభ్యులు చేతులు ఎత్తి ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారని ఆయన వివరించారు.

రేపు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ రద్దు

బాపట్ల: ఎస్టీలు, దివ్యాంగుల కోసం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌ను అనివార్య కారణాలు, పరిపాలన సౌలభ్యంలో భాగంగా శుక్రవారం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఫిర్యాదుదారులు కలెక్టరేట్‌కి రావద్దని ఆయన సూచించారు. ఈ విషయాన్ని జిల్లాలోని ఎస్టీలు, దివ్యాంగులు గమనించాలని ఆయన కోరారు.

ఏప్రిల్ నుంచి రబీ ధాన్యం కొనుగోలు

నరసరావుపేట: రబీ 2024–25కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ఏప్రిల్ మొదటి వారం నుంచి ప్రారంభమవుతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయ పేర్కొన్నారు. ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ జిల్లాలో అధిక భాగం పూర్తయిందని, ఈనెల 29 నాటికి పూర్తి చేస్తామని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 115 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అందులో 73 రైతు భరోసా కేంద్రాల ద్వారా 1947 మంది రైతుల వద్ద నుంచి 13,737 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు.

పీఎం యోగా అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట ఈస్ట్: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తులకు, లేదా సంస్థలకు అందించే ప్రధానమంత్రి యోగా అవార్డు–2025కు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి బుధవారం తెలిపారు.అర్హులైన వారు దరఖాస్తులను https://innovateindia.mygov.in/pm-yoga-awards-2025 వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

తెనాలిలో సదరం క్యాంప్ పునఃప్రారంభం



తెనాలి అర్బన్: దివ్యాంగుల ధ్రువపత్రాలను పునఃపరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన దివ్యాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. బుధవారం ఆర్థో–90, ఈఎన్‌టీ–42, సైక్రాటిక్–45 మందికి పరీక్షలు చేసినట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు. గురు, శుక్రవారాలలో కూడ క్యాంప్ జరుగుతుందని చెప్పారు.

నృసింహస్వామి ఆలయ హుండీల లెక్కింపు నేడు

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీలను గురువారం లెక్కిస్తామని ఈఓ రామకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్‌రోడ్‌లో ఉన్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీలను గురువారం ఉదయం 9 గంటలకు లెక్కించనున్నట్లు వివరించారు.

బెదిరిద్దాం.. కొట్టేద్దాం !

- పిట్టలవానిపాలెం ఎంపీపీ కోసం టీడీపీ కుట్రలు
- ఎమ్మెల్యే వర్మ సొంత మండలంలో పట్టు కోసం అడ్డదారులు
- ఎంపీటీసీ సభ్యులకు బెదిరింపులు, ప్రలోభాలు
- బలం లేకున్నా బలవంతపు ప్రయత్నాలు
- మండలంలో 11 మంది ఎంపీటీసీ సభ్యులు
- టీడీపీకి ఇద్దరు మద్దతంటూ ప్రచారం
- వైఎస్సార్ సీపీకి మద్దతుగా తొమ్మిది మంది
- నేడు ఎంపీపీ, వైస్ ఎంపీపీ స్థానాలకు ఎన్నిక



సాక్షి ప్రతినిధి, బాపట్ల: నామమాత్రంగా కూడా బలం లేకపోయినా బాపట్ల నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు పచ్చ పార్టీ కుట్రలకు తెరతీసింది. సొంత మండలం కావడంతో ఎలాగైనా మండల పరిషత్ అధ్యక్ష పదవి కాజేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు అధికారం తోడు కావడంతో అడ్డే లేకుండా పోయింది. సొంత మండలంలో ఎంపీపీ స్థానాన్ని దక్కించుకొని బలం చాటే ప్రయత్నంలో ఎమ్మెల్యే వర్గం ఉంది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సూచనలందుకున్న మండల పచ్చ బలగం సంఖ్యా బలం లేకపోయినా కుట్రలు పన్నుతోంది. అధికారం బలంతో ఎంపీటీసీ సభ్యులను బెదిరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కొందరిని ప్రలోభపెట్టి తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అప్పటికీ దారిలోకి రాకపోతే బెదిరిస్తున్నారు. తమకు మద్దతు పలికితే పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెపుతామని ఎంపీటీసీ సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యులను ప్రలోభ పెట్టినట్లు సమాచారం. తమ వైపునకు వస్తే అడిగినంత డబ్బులు ఇస్తామని ఆశ పెడుతున్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచ్ లేదా ఎంపీటీసీ సభ్యులు పదవులు ఇస్తామని మరికొందరు ఎంపీటీసీ సభ్యులకు హామీ ఇస్తున్నట్లు సమాచారం.

ప్రలోభాలకు లొంగని సభ్యులు

పచ్చ నేతలు ఎంతగా ప్రయత్నించినా ప్రలోభాలకు ఏమాత్రం లొంగని ఎంపీటీసీ సభ్యులు వైఎస్సార్ సీపీకే మద్దతని తేల్చి చెబుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పోలీసు అధికారులను అడ్డ పెట్టి వీరిని బెదిరించే ప్రయత్నాలు సాగించినట్లు తెలుస్తోంది. పిట్టలవానిపాలెం ఎంపీపీ పరిధిలో మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం, జీఎస్‌పాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, భవనం వారిపాలెం, సంగుపాలెం, చందోలు–1,2,3 స్థానాలతో కలిపి మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ముందు సంగుపాలెం ఎంపీటీసీ సి.గంగయ్య టీడీపీకి మద్దతు పలికారు. తాజాగా మండలంలోని మరో ఎంపీటీసీ సభ్యుడు టీడీపీకి మద్దతు పలికినట్లు ప్రచారం ఉంది. దీంతో ప్రస్తుతం వైఎస్సార్ సీపీకి తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యుల మద్దతుంది. టీడీపీ తరఫున పచ్చ పార్టీకి మద్దతు పలికిన గంగయ్యను ఎంపీపీ అభ్యర్థిగా ప్రకటించగా వైఎస్సార్ సీపీ తరఫున ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఉన్న పిట్టలవానిపాలెం ఎంపీటీసీ సభ్యుడు దిందుకూరి సీతారామరాజును ప్రకటించారు. గురువారం జరిగే ఎన్నికలో మెజార్టీ సభ్యుల మద్దతు మేరకు ఎంపీపీతో పాటు వైస్ ఎంపీపీని ఎన్నుకోనున్నారు. సంఖ్యా బలం ప్రకారం వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు ఘన విజయం సాధించే అవకాశముంది. ఈ ఎన్నిక కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయం

రైతన్నను ముంచిన కూటమి సర్కారు



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున
- వ్యవసాయం దండగా అన్నట్లు కూటమి పాలన
- రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

బాపట్ల: రాష్ట్రంలో కూటమి సర్కారు రైతన్నను నట్టేట ముంచిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలో రైతన్న పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఒక పక్కన అల్లాడిపోతుంటే, మరోవైపు సంక్షేమ ఫలాలు నిలిచిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయం దండగా అనే విధంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు రైతన్నను ఆదుకునేందుకు అన్ని విధాలుగా కృషి చేసినట్లు గుర్తు చేశారు. రైతుభరోసా కేంద్రం ద్వారా గింజ నాటిన దగ్గర నుంచి పంటలు విక్రయించే వరకు అన్నీ ప్రభుత్వం చూసుకునేదని తెలిపారు. మూడు వేల కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులకు మేలు చేశారని చెప్పారు. నేడు పొగాకు, మిర్చి, జొన్న, పసుపు, చెరకు పంటలకు సరైన ధరలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పంటకు గిట్టుబాటు ధర లేక ఒక పక్కన, మరోవైపు సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చుకోలేక దైనందిన స్థితిలో ఉన్నారని వివరించారు. ఇప్పటికైనా రైతులను పట్టించుకోవాలని కూటమి ప్రభుత్వానికి సూచించారు.రైతులను ఆదుకునే వరకు వైఎస్సార్ సీపీ అండగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ధరల స్థిరీకరణ నిధి ఎక్కడ ?
మాజీ డిప్యూటీ స్పీకర్ కోన

ధరలు తగ్గినప్పుడు రైతులను ఆదుకునేందుకు ధరల స్థిరీకరణ నిధి గురించి కూటమి సర్కారు పట్టించుకోకపోవడం విచారకరమని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి రైతూ ఎంతో సంతోషంగా ఉన్నారని చెప్పారు. మార్క్‌ఫెడ్ ద్వారా కూడా అనేక పంటలను కొనుగోలు చేయించి రైతులకు మేలు చేసిన విషయాన్ని కోన గుర్తు చేశారు. బాపట్లలో నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను తిరిగి ప్రారంభించే విధంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజును ప్రశ్నించాలని కోన సూచించారు. రైలు పేటలో సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే వేగేశన ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడు తనకు కొంతమంది ఫోన్ చేశారన్నారు. మెడికల్ కళాశాల గురించి ప్రస్తావించకుండా సమస్యలను ఎమ్మెల్యే అడగటం ఆశ్చర్యంగా ఉందని చెప్పారని కోన తెలిపారు. బాపట్ల ప్రాంతాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించే మెడికల్ కళాశాల సాధన కోసం అందరం కలిసి కృషి చేయాలని కోన పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా కావడం, మరోవైపు మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతాభివృద్ధి వేగంగా ఉంటుందని కోన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు కొండలరెడ్డి, పార్టీ నాయకులు గవిని కృష్ణమూర్తి, కోకి రాఘవ రెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, పిన్నిబోయిన ప్రసాద్, కొక్కిలిగడ్డ చెంచయ్య, జోగి రాజా పాల్గొన్నారు.

అడకత్తెరలో జెడ్పీ !



ఈనెల 15న జెడ్పీ సమావేశాన్ని బహిష్కరించిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు

చైర్‌పర్సన్ వర్సెస్ సీఈఓ

- 29న జెడ్పీ సర్వసభ్య సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు
- వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రకటన
- యథావిధిగా నిర్వహిస్తామన్న సీఈఓ
- చైర్‌పర్సన్ ఏకపక్ష వైఖరిపై సభ్యుల గుర్రు
- ఈనెల 15న సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలిపిన వైఎస్సార్ సీపీ సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్‌లో హైడ్రామా నెలకొంది. ఈనెల 29న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో వాయిదా వేస్తున్నట్లు బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రకటించారు. అనివార్య కారణాలతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని, మళ్లీ నిర్వహించే తేదీని త్వరలో తెలిజేస్తామని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా కలెక్టర్లు, అధికారులకు సమాచారాన్ని పంపారు.

విరుద్ధంగా సీఈఓ ప్రకటన

ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈనెల 29న జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని యథావిధిగా నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒక వైపు సమావేశాన్ని వాయిదా వేయాలని చైర్‌పర్సన్ యత్నాలు సాగిస్తుండగా, నిబంధనల ప్రకారం ఒకసారి సమావేశాన్ని నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారు చేసి, ప్రజా ప్రతినిధులకు, సభ్యులకు, అధికారులకు నోటీసులు పంపిన తరువాత హఠాత్తుగా సమావేశాన్ని వాయిదా వేసేందుకు వీలు కాదని సీఈఓ చెబుతున్నారు.

గతంలో కోరం లేక!

జెడ్పీ ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదం కోసం ఈనెల 15న ఏర్పాటు చేసిన సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. తమకు తెలియకుండా, అనుమతి లేకుండా అభివృద్ధి పనులకు ముందస్తు అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా నిధుల కేటాయింపుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు సమావేశానికి గైర్హాజరైన నేపథ్యంలో కోరం లేక నిరవధికంగా వాయిదా పడింది. ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉండటంతో చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా సూచనతో అధికారులు ఈనెల 29న మరోసారి సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సర్వసభ్య సమావేశ నిర్వహణకు రెండు రోజులే వ్యవధి ఉన్న కీలక సమయంలో అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నామని ప్రకటించడం విస్మయాన్ని కలిగిస్తోంది.

నోటి మాటతో వాయిదా వేయలేం

జెడ్పీ సమావేశాన్ని నిర్వహించాలన్నా, వాయిదా వేయాలన్నా నోటిమాటతో జరిగే పని కాదని అధికారులు చెబుతున్నారు. షెడ్యూల్ ఖరారు చేసి, నోటీసులు పంపిన తరువాత సమావేశాన్ని వాయిదా వేయాలంటే 50 శాతం మంది జెడ్పీటీసీల అంగీకారం ఉండాలని పేర్కొంటున్నారు. దీని ప్రకారం.. 54 మంది జెడ్పీటీసీల్లో 27 మంది సంతకాలు చేసి, సమావేశాన్ని వాయిదాకు అంగీకారం తెలపాల్సి ఉంది. అయితే సభ్యుల్లో 90 శాతానికి పైగా వైఎస్సార్ సీపీకి చెందిన వారే. వీరు చైర్‌పర్సన్ వ్యవహారశైలిపై అసంతృప్తిగా ఉన్న దృష్ట్యా, సంతకాలు చేసే అవకాశం లేదు. మరోవైపు సమావేశాన్ని వాయిదా వేయడం వెనుక సహేతుకమైన కారణాలేవీ కనిపించడం లేదు. అయితే బడ్జెట్‌లో ప్రభుత్వ పథకాలను అదనంగా చేర్చాల్సిన దృష్ట్యా మెజార్టీ సభ్యులు వ్యవధి కావాలని కోరిన మేరకే సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని చైర్‌పర్సన్ కార్యాలయం ద్వారా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనడం గమనార్హం.



ఈనెల 15న జరిగిన సమావేశంలో సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

బైపాస్‌తోనే ప్రమాదాలకు చెక్

- తరచూ ట్రాఫిక్ సమస్య
- పదేళ్ల కిందటే బైపాస్ నిర్మాణానికి కొలతలు
- సంవత్సరానికి వందకు పైగానే ప్రమాదాల్లో మరణాలు
- పట్టణం నుంచి నిమిషానికి వంద వాహనాల ప్రయాణం

అద్దంకి: పెరిగిన జనాభా, వాహనాలతో అద్దంకి పట్టణ రహదారులు రద్దీగా మారాయి. మరో వైపు రాష్ట్రీయ రహదారి పట్టణం నుంచి వెళుతుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నెలకు నాలుగైదు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒకరిద్దరు మృతి చెందడం పరిపాటిగా మారింది. ఈ సమస్యను పదేళ్ల కిందటే ప్రజల వినతుల మేరకు గుర్తించిన అధికారులు బైపాస్ అవసరమని నిర్ధారించారు. పట్టణానికి ఎటువైపు నిర్మిస్తే బాగుంటుందనే నిర్ధారణ కోసం సర్వే కూడా నిర్వహించారు. అది కార్యరూపం దాల్చలేదు.

అద్దంకి రాష్ట్రీయ రహదారి మీదుగా భారీ వాహనాల ప్రయాణం



అద్దంకిలోని రాష్ట్రీయ రహదారి

భారీ వాహనాలతో ట్రా'ఫికర్'

పట్టణం మధ్య నుంచి అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతుంది. ఇది మేదరమెట్ల వద్ద జాతీయ రహదారితో అనుసంధానమే ఉంటుంది. దీంతో కన్యాకుమారి నుంచి హైదరాబాదు వైపు వెళ్లాల్సిన భారీ వాహనాలు అద్దంకి వైపు మరలుతున్నాయి. ఢిల్లీ వైపు నుంచి వచ్చే వాహనాల్లో కొన్ని రేణింగవరం నుంచి అద్దంకి వైపు వస్తున్నాయి. మరో వైపు సంతమాగులూరు వద్ద అడ్డ రోడ్డు నుంచి వివిధ జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలు కూడా అద్దంకి వైపు వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. చిన్నా చితకా వాహనాలతో కలిపి నిమిషానికి వందకు పైగా ప్రయాణం చేస్తుంటాయని అధికారికంగా కూడా గతంలో లెక్కలు కట్టారు. ప్రస్తుతం రాష్ట్రీయ రహదారి నుంచి వెళ్తున్న భారీ వాహనాలను బైపాస్ ద్వారా మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని నిపుణుల అంచనా.

మునిసిపల్ కౌన్సిల్‌లో తీర్మానం

పట్టణంలోని ఎన్నెస్పీ కాలువ కట్టకు రెండు వైపులా రహదారిని ఏర్పాటు చేసే ప్రతిపాదన చాలా సంవత్సరాల నుంచి నడుస్తోంది. దీనికి ఇటీవలే మునిసిపల్ కౌన్సిల్‌లో తీర్మానం ఓకే చెప్పింది. అయితే, ఏళ్ల తరబడి కాలువ కట్టపై నివాసాలు ఉంటున్న వారిని ఖాళీ చేయించి, మరో చోట వసతి కల్పించడమే పెద్ద సమస్యగా మారింది. ప్రజా ప్రతినిధులు అటు వైపుగా దృష్టి సారించి బైపాస్ ఏర్పాటు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బైపాస్‌తోనే సమస్యలకు పరిష్కారం



పట్టణంలో రాష్ట్రీయ రహదారి నుంచి వస్తున్న భారీ వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు రోజుకో ప్రమాదం జరుగుతోంది. బైపాస్‌ను నిర్మిస్తే వాహనాలు పట్టణంలోకి వచ్చే అవసరం ఉండదు. ప్రమాదాలకు కూడా చెక్ పెట్టినట్లు అవుతుంది.

– జి. చంద్రమౌళి, అద్దంకి

ఔటర్ బైపాస్ నిర్మించాలి



భారీ వాహనాల వల్ల పట్టణంలో ట్రాఫిక్ భారీగా పెరిగింది. కన్ను మూసి తెరచే లోపల రెండు మూడు వాహనాలు వెళుతున్నాయి. వాటి వేగం కూడా ఎక్కువగానే ఉంది. ఈ పరిస్థితుల్లో పట్టణం వెలుపలగా బైపాస్ నిర్మించడంతోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది.

–తంగిరాల వెంకటేశ్వర్లు, సీపీఎం



క్రీడా హరివిల్లు

పెదకాకాని మండలం నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం(వీవీఐటీయూ) క్యాంపస్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విల్లు ఎత్తిన క్రీడాకారులను చిత్రంలో చూడొచ్చు.

8లో..

క్లుప్తంగా

నవోదయ ఫలితాలు విడుదల

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన అర్హత పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఏడాది జనవరి 18వ తేదీన నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నిర్వహించడం జరిగింది. మొత్తం 80 ఖాళీలకు మెరిట్ సాధించి సీట్లు పొందిన వారి వివరాలను విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహరావు బుధవారం వెల్లడించారు. అలాగే సీట్లు పొందిన విద్యార్థులు తమ దరఖాస్తులో ఇచ్చిన సెల్‌ఫోన్ నంబర్లకు వ్యక్తిగతంగా సమాచారం అందించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్మీ జవాను మృతి

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న వ్యాన్

మాచర్ల రూరల్: ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తూ ఐషర్ వ్యాన్ వాహనాన్ని ఢీ కొనటంతో అందులో ఆర్మీ జవాను మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం నారాయణపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఇంద్రసేనారెడ్డి (26) ఆర్మీలో జవానుగా పని చేస్తుంటాడు. స్నేహితుడైన కాశిరెడ్డితో కలిసి హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై మాచర్ల వైపు వస్తున్నారు. కొత్తపల్లి జంక్షన్, ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ సమీపంలోకి వారు రాగానే ఎదురుగా మొక్కజొన్న లోడ్‌తో వస్తున్న ఐషర్ వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఇంద్రసేనారెడ్డికి తలకు తీవ్రంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న కాశిరెడ్డికి కూడా బలమైన గాయం కావడంతో అతడిని తొలుత మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం నర్సరావుపేటకు తరలించారు. ప్రమాదంపై విజయపురి సౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కంది, శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



యడ్లపాడు: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రాల్లో కందులు, శనగలు కొనుగోలు చేసేందుకు కేంద్రాల్ని ప్రారంభించామని యడ్లపాడు ఏఓ సీహెచ్ సరిత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ జిల్లా జేసీ ఆదేశాల మేరకు రైతులు సాగు చేసిన కంది, శనగ పంట ఉత్పత్తుల్ని కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని ఆమె సూచించారు. కంది క్వింటాకు రూ.7,550, శనగకు రూ.5,650 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు. విక్రయాలకు ముందుగా కేంద్రాల్లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా పూర్తి చేయాలని ఆమె రైతులకు సూచించారు.

అనుమతి లేకుండా మిరప విత్తనాల ప్యాకింగ్

రూ. 4.98 లక్షల విలువైన విత్తనాల సీజ్

సంతమాగులూరు(అద్దంకి): అనుమతి లేకుండా మిరప విత్తనాలను ప్రాసెస్ చేసి, బల్క్ ప్యాకింగ్ చేస్తున్న శిబిరంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. వివరాలను బుధవారం వెల్లడించారు. వ్యవసాయాధికారి లావణ్య తెలిపిన వివరాల మేరకు.. గుంటూరులోని ఆదర్శ్ నగర్‌కు చెందిన పంపతి శ్రీనివాసరావు కడప తదితర ప్రాంతాల్లో మిరప కాయలు గ్రేడింగ్ చేయగా చివరలో వచ్చిన విత్తనాలను కొనుగోలు చేసి, సంతమాగులూరు మండలంలోని మావిళ్లపల్లి కొండల్లో రాత్రి పూట మిషన్ల ద్వారా ప్రాసెస్ చేస్తుంటాడు. 50 కిలోల బల్క్ ప్యాకింగ్ చేసి రిటైల్ వ్యాపారులకు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో



మిరప విత్తనాలు ప్రాసెస్ చేస్తున్న శిబిరం వద్ద విజిలెన్స్ అధికారులు

అందిన సమాచారం మేరకు గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు మంగళవారం తెల్లవారుజామున దాడి చేశారు. కొండ సందుల్లో మిరప విత్తనాలు ప్రాసెస్ చేస్తున్న శిబిరంపై దాడులు చేశారు. అక్కడ తెల్ల గోతాల్లో ప్యాక్ చేసిన రూ.7.98 లక్షల విలువైన 7,875 కిలోల విత్తనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖర్, పల్నాడు సీఐ శివాజీ, గుంటూరు విజిలెన్స్ ఏవో ఆదినారాయణ పాల్గొన్నారు.

అనుమానితులపై ప్రత్యేక నిఘా

- గస్తీ విధుల్లో ఎంఎస్‌సీడీతో వేలి ముద్రలు
- నెల రోజుల్లో 7,953 మంది నుంచి సేకరణ

బాపట్ల టౌన్: రాత్రి సమయంలో రోడ్లపై తిరుగుతున్న అనుమానాస్పద వ్యక్తుల నుంచి వేలి ముద్రలు సేకరిస్తున్నట్లు ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో బుధవారం రాత్రి గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం గడిపేందుకు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. రాత్రి వేళల్లో లాడ్జిలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లో కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అనుమానిత వ్యక్తులను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ (ఎంఎస్‌సీడీ) పరికరం ద్వారా అనుమానితుల వేలిముద్రలను సేకరించి, వారి గత నేర చరిత్ర తెలుసుకుంటున్నట్లు వివరించారు. గడిచిన నెల రోజుల్లో రాత్రి సమయాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 7,953 మంది వ్యక్తుల వేలిముద్రలను ఈ పరికరం ద్వారా స్కాన్ చేసినట్లు చెప్పారు. ఇందులో 17 మంది గతంలో వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో మినహా వివిధ కారణాలతో అర్ధరాత్రుళ్లు బయటకు వచ్చేవారు తప్పనిసరిగా గుర్తింపు కార్డు ఏదైనా వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు. గుర్తింపు కార్డు లేనివారిని అనుమానితులుగా పరిగణించి విచారించాల్సి ఉంటుందని చెప్పారు. గస్తీ నిర్వహించే పోలీస్ సిబ్బంది ప్రశ్నించినప్పుడు వారికి సహకరించాలని ఆయన కోరారు. నేరాలను నియంత్రించడానికి పోలీస్ శాఖ తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక



బాపట్ల టౌన్: జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం బాపట్లలో ప్రస్తుతం చైర్మన్ బడుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. చైర్మన్‌గా ఏ. శేఖర్‌బాబు, కో–చైర్మన్లుగా బత్తుల వెంకటేశ్వర్లు, షేక్ ఘన్ సయ్యద్, డెప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా ఒ.వినయ్ కుమార్, గుడివాడ అమర్నాథ్, ఈ.నారాయణ, ట్రెజరర్‌గా దేవరకొండ ప్రసాదరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులకు ధన్యవాదాలు తెలిపింది. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర ఫ్యాప్టో కోశాధికారి చింతల సుబ్బారావు హాజరయ్యారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 2022 సెప్టెంబర్ 3న నమోదైన భార్య హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ మంగళగిరి సివిల్ జడ్జి ఎం.అంజనీప్రియదర్శిని బుధవారం తీర్పునిచ్చారు. భర్త తగరపు నాగరాజు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనపై కత్తితో దాడిచేశాడని 2002 సెప్టెంబర్ 3న తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పగడాల సంధ్యారాణి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మంగళగిరి సివిల్ జడ్జి ఎం.అంజనీ ప్రియదర్శిని వాద ప్రతివాదనలు విన్నారు. ఈ నేపథ్యంలో నాగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

నేడు జీడీసీసీ బ్యాంకు మహా జనసభ

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మహాజన సభ గురువారం బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ అధ్యక్షతన బ్రాడీపేటలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరగనుందని బ్యాంకు సీఈఓ కృష్ణవేణి బుధవారం తెలిపారు. సంఘ సభ్యులందరూ సమావేశానికి విధిగా హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సిజేరియన్లు చేసే ఆస్పత్రులకు నోటీసులివ్వండి

- పీహెచ్‌సీల్లో ప్రసవాలు పెంచండి
- అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

గుంటూరు మెడికల్: నూరు శాతం సిజేరియన్ చేసిన ప్రైవేటు ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. బుధవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ నూరు శాతం సిజేరియన్లు చేసిన ప్రైవేటు ఆసుపత్రుల్లో జిల్లా టీమ్‌లతో తనిఖీలు చేయాలని చెప్పారు. ఆ ఆసుపత్రులపై నిఘా ఏర్పాటు చేయాలని, సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో లభించే మందుల వివరాలు ప్రతిరోజూ తప్పనిసరిగా ఆసుపత్రి నోటీసు బోర్డులో అందరికీ కన్పించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. క్షయ వ్యాధిగ్రస్తులను సత్వరమే గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో నిర్వహించే క్షయ వ్యాధి పరీక్షల వివరాలు తప్పనిసరిగా సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేయాలని చెప్పారు. జిల్లాలో ప్రతిరోజు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే కుక్కకాటు, పాముకాటు కేసుల వివరాల గురించి ఆరా తీశారు.



జిల్లా వైద్య అధికారులతో సమీక్ష చేస్తున్న అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్

సంబంధిత వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా జిల్లా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రసవాలు ఆరోగ్య కేంద్రాల్లో పెంచేందుకు సంబంధిత పీహెచ్ వైద్య అధికారులకు ఆదేశాలు మార్గదర్శకాలు జారీ చేయాలని ఆదేశించారు. ఆర్సీహెచ్, హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో గర్భిణుల నమోదు నూరు శాతం తప్పనిసరి చేయాలన్నారు. గర్భిణీలు, చిన్నారులకు నూరు శాతం వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల గురించి డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ రత్నమన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

వైఎస్సార్ సీపీ రైతు విభాగ అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి

చీరాల టౌన్: భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయంలో మురుగు, వర్షపు నీటిని తనలో కలుపుకుని ప్రజల ప్రాణాల్ని కాపాడే కుందేరును పూడ్చివేస్తూ పర్యావరణానికి ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగ అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తోటవారిపాలెం, కావూరివారిపాలెం తదితర గ్రామాల్లో ఉన్న పేర్లి డ్రెయిన్ నుంచి కలిసే కుందేరును నాలుగు చోట్ల మూసి వేసి ఇసుక తవ్వకాలు చేయడాన్ని ఆయన పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తూ ప్రకృతి వనరులను దోచుకుంటున్నారని విమర్శించారు. కుందేరును పూడ్చి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.



ఇసుక రవాణా జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రమణారెడ్డి

యువకుడి ఆత్మహత్య

బల్లికురవ: ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తితో ఓ యువకుడు పొలంలో చెట్టుకు ఉరి పోసుకున్నాడు. వివరాలు.. బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన కీర్తిపాటి బ్రహ్మయ్యకు(28) ఎనిమిది నెలల కిందట యద్దనపూడి మండలం యనమదలకు చెందిన లావణ్యతో వివాహమైంది. ఆమె ప్రస్తుతం గర్భిణి. పెళ్లికి ముందు ఐదు సంవత్సరాల కిందట ఇంటి నిర్మాణానికి తీసుకువచ్చిన అప్పులు పెరగడంతో బ్రహ్మయ్య తరచూ మథన పడుతున్నాడు. నాలుగు రోజుల కిందట భార్య లావణ్యను కాన్పు నిమిత్తం పుట్టింట్లో వదిలి పెట్టాడు. మంగళవారం సాయంత్రం పొలం వెళ్లి వస్తానని వెళ్లి గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి పోసుకున్నాడు. ఎంతసేపటికీ బ్రహ్మయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకగా చెట్టుకు వేలాడుతూ కనబడ్డాడు. కిందకు దించి వైద్యానికి అద్దంకి తరలించారు. చికిత్స అందేలోపే చనిపోయాడు. మృతుని తండ్రి ఏడుకొండలు ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఐ వీవీ చౌదరి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



బ్రహ్మయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

సారా జోలికి వస్తే పీడీయాక్ట్ అమలు

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ
- జిల్లా బహిష్కరణకు వెనుకాడేది లేదు

బాపట్ల టౌన్: నాటు సారా తయారుచేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ప్రకాశం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ తెలిపారు. బుధవారం మండలంలోని స్టువార్టుపురం, బేతపూడి గ్రామాల్లో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కె. విజయ మాట్లాడుతూ పదేపదే నాటుసారా తయారుచేస్తూ పట్టుబడిన వారిని ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా బహిష్కరణ చేసేందుకు కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ ఎ. దేవదత్తు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, బాపట్ల సీఐ పి. గీతిక, ఎస్ఐలు ప్రభుదాస్, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.



నవోదయం 2.0 కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు

28, 29 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: సెయింట్ జోసఫ్ మహిళా బీఈడీ కళాశాలలో ఈనెల 28, 29 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.స్వరూపరాణి తెలిపారు. సాంబశివపేటలోని కళాశాలలో బుధవారం సదస్సు బ్రోచర్, ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ గ్లోబల్ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ (జీసీపీఏ), సెయింట్ జోసఫ్ మహిళా బీఈడీ కళాశాల సంయుక్తంగా తొలిసారిగా అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'సైకో సోషల్ కాంపిటెన్సీస్ ఫర్ గ్లోబల్ యూత్'' అనే అంశంపై ఏర్పాటు చేస్తున్న సదస్సు ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. మధుమూర్తి, ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, గుంటూరు జేఎంజే ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ విజయమేరీ ఉడుముల, పలువురు ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొంటుండగా, ఎస్వీయూ పూర్వ వీసీ ఆచార్య వి.శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య ప్రసంగం చేస్తారని వివరించారు. దేశ, విదేశాల నుంచి పరిశోధకులు, అధ్యాపకులు, వివిధ రంగాల ప్రముఖులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా సదస్సుకు హాజరు కానున్నారని చెప్పారు. జీసీపీఏ అధ్యక్షురాలు డాక్టర్ డి. సరోజ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సామాజిక, మానసిక పరిస్థితులకు అనుగుణంగా యువతను సక్రమమైన మార్గంలో పయనింపచేయడంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు సదస్సు దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ ఏ. రోజిలీన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టీఎస్ సుభాషిణి పాల్గొన్నారు.



సదస్సు బ్రోచర్ విడుదల చేస్తున్న స్వరూపరాణి, రోజిలీన్, సరోజ, సుభాషిణి, శ్రీలత

డీఎస్సీ శిక్షణ కోచింగ్ సెంటర్స్‌ను ఎంపిక చేసుకోండి

భట్టిప్రోలు: రెసిడెన్షియల్ విధానంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించే డీఎస్సీ శిక్షణ కోసం కోచింగ్ సెంటర్స్‌ను ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఎంపిక చేసుకోవాలని ఎంపీడీవో ఎస్. వెంకట రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫేజ్–2 విద్యార్థులను మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేశామని ఆయన పేర్కొన్నారు. వివరాలను https://mdfc.apcfss.in లో పొందు పరచినట్లు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులు కోచింగ్ ఇనిస్టిట్యూట్ ప్రాధాన్యత క్రమాన్ని ఈ 28వ తేదీలోగా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఫేజ్–1 విద్యార్థులకు ఎటువంటి ఎడిట్ ఆప్షన్ లేదని వెల్లడించారు.

యార్డుకు 1,46,260 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,46,260 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,45,568 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,100 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,300 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 70,065 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

నేనూ అఘోరీగా మారతా !

- అఘోరీతో వెళ్లిన మంగళగిరి యువతి
- మంచిర్యాల స్టేషన్‌లో తల్లిదండ్రుల పైనే ఫిర్యాదు

మంగళగిరి: అఘోరీతో కలిసి వెళ్లిన మంగళగిరికి చెందిన యువతి తానూ అఘోరీగా మారుతానంటోంది. మంగళవారం ఆమె అఘోరీ అలూరి శ్రీనివాసరావుతో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల చేరుకుంది. మంచిర్యాల జిల్లాలోని అఘోరీ సొంతూరు నెండెల్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను ఇష్టపూర్వకంగానే అఘోరీగా మారుతున్నానని ఎవరి బలవంతం లేదని తనకు తల్లిదండ్రులు, విష్ణు అనే యువకుడి వల్ల ప్రాణహాని ఉందని రక్షించాలని ఫిర్యాదు చేసింది. వారం ముందే అఘోరీతో కలిసి వెళ్లిన యువతి కనిపించడం లేదని ఆమె తలిదండ్రులు మంగళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలి

నరసరావుపేటలో రోడ్డెక్కిన 'సాయిసాధన ' బాధితులు

నరసరావుపేట టౌన్: సాయిసాధన చిట్‌ఫండ్ స్కాంలో ప్రధాన నిందితుడు పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని బాధితులు బుధవారం పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రోడ్డులో రాస్తారోకోకు దిగారు. ఈ సందర్భంగా బాధితుల కమిటీ సభ్యులు చేకూరి సాంబశివరావు, యామిని రామారావులు మాట్లాడుతూ.. ప్రజల నుంచి నమ్మకంగా సుమారు రూ.400 కోట్లు వసూలు చేసి పరారైన పాలడుగు పుల్లారావు విషయంలో బాధితులకు న్యాయం చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సాయిసాధన చిట్‌ఫండ్ పేరుతో చీటీలు, డిపాజిట్ల రూపంలో సుమారు వెయ్యిమంది నుంచి రూ.కోట్లు సేకరించి రెండు నెలల క్రితం పుల్లారావు కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లాడన్నారు. బాధితులు నరసరావుపేట, గుంటూరు పోలీసుస్టేషన్లలో ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశారన్నారు. గుంటూరులో లొంగిపోయి పుల్లారావు ప్రస్తుతం సబ్‌జైలులో ఉండగా, చిట్‌ఫండ్‌లో డైరెక్టర్లుగా ఉన్న అతని భార్య, కుమార్తె, కుమారుడు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తూ బయట దర్జాగా తిరుగుతున్నారని వాపోయారు. వారిని అరెస్ట్ చేయడంతో పాటు పుల్లారావు ఆస్తులను స్వాధీనం చేసుకొని బాధితులకు పంచాలని డిమాండ్ చేశారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, హోంమంత్రి అనిత, ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవి, ముఖ్యమంత్రి చంద్రబాబులను సైతం కలసి విన్నవించినా ఉపయోగంలేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ వల్ల ఎటువంటి ప్రయోజనం కనిపించడంలేదన్నారు. బాధితులు రూ.400 కోట్లు నష్టపోతే న్యాయం చేయడంలో సిట్ బృందం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయకపోతే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం



నంబూరు వీవీఐటీలో నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ రవినాయుడు

పెదకాకాని: ఆర్చరీ క్రీడాకారులు అత్యున్నత శిఖరాలను అధిరోహించి రాష్ట్రఖ్యాతిని పెంచాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు చెప్పారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి అంతర్జాతీయ సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 29 వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీలను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు, అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత సంజీవ సింగ్, వివిఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్చరీ క్రీడకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్చరీ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న చెరుకూరి లెనిన్ వోల్గా అసోసియేషన్ కృషి ప్రశంసనీయమన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. అమరావతి వేదికగా స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటునట్లు వివరించారు. వీవీఐటీయూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ నిర్వహణకు వీవీఐటీ యూనివర్శిటీ వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఆర్చరీ వంటి క్రీడల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, స్నేహసంబంధాలు పెరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు పాల్గొనేందుకు దేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 900 మంది ఆర్చరీ క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారు. అండర్ 10, అండర్ 13, అండర్ 15 విభాగాలుగా నిర్వహించనున్న పోటీలలో తొలి రోజు బుధవారం 723 మంది పోటీదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చెరుకూరి సత్యం, వివిఐటియూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.